

టీడీపీ పాలన బీసీలకు స్వర్ణయుగం

- జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి
- గుడిబండలో జయహో బీసీ కార్యక్రమం



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

గుడిబండ, జనవరి 29: టీడీపీ పాలన బీసీలకు స్వర్ణయుగం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గుడిబండలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. బీకే మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీల అభివృద్ధికి సబ్సిడీ రుణాలు, సబ్‌ప్లాన్ ద్వారా ప్రత్యేక నిధులు అందించి, ఆదుకున్నామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులు సుమారు రూ.34వేల కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. బీసీ మైనార్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములను రాష్ట్రంలో వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. బీసీలు ఏకమై వచ్చే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని మందలపల్లి, వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు సుమారు 200మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి పార్టీ కండువావేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకు ముందు పళారం క్రాస్ నుంచి గుడిబండ వరకు సుమారు 200మంది ద్విచక్రవాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు పోతులయ్య, వడ్డె వెంకట్, శ్రీనివాస్, దుర్గేష్, మంజునాథ్, గోవిందప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి భూ అక్రమాలపై విచారణ చేయించాలి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల ఫిర్యాదు



ఎమ్మెల్యే కేతిరెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

పుట్టపర్తి, జనవరి 29: ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూఅక్రమాలపై సమగ్ర విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ.. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల.. కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రోద్బలంతోనే తహసీల్దార్ యుగేశ్వరీదేవి పెద్దఎత్తున భూఅక్రమాలకు పాల్పడ్డారంటూ ఆమెను సస్పెండ్ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ భూఅక్రమాలపై సమగ్ర విచారణ చేయించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం గోనుగుంట్ల మీడియాతో మాట్లాడుతూ.. ధర్మవరంలో పాలేగాళ్ల రాజ్యం నడుస్తోందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేతిరెడ్డి వేలకోట్ల రూపాయలు గడించారన్నారు. నిరుపేదలు, అమాయకులను టార్గెట్ చేసుకుని, రూ.కోటి విలువచేసే భూమిని కేవలం లక్ష, రెండు లక్షలకు కొనుగోలు చేసి, కోట్లు గడించాడన్నారు. 4వేలకోట్ల రూపాయలు కేతిరెడ్డి అక్రమంగా సంపాదించాడని ఆరోపించారు. రౌడీలు, గుండాలను పెంచిపోషిస్తున్నారని మండిపడ్డారు. చేనేత వర్గాలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఏకంగా ఇంట్లోనే రిజిస్ట్రార్ ఆఫీసు ఏర్పాటు చేసుకున్నారన్నారు. డిజిటల్ కీ ఇంట్లో పెట్టుకుని, ఒక్కో రిజిస్ట్రేషన్‌పై రూ.10లక్షల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అక్రమాలపై ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమగ్ర విచారణ చేయిస్తామని ఆయన ఉద్ఘాటించారు.

రోడ్డు ధ్వంసం చేయడంపై ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం, జనవరి 29: లేపాక్షి మండలం నాయనపల్లిలో విజయవాడ ఎంపీ నిధులతో వేసిన రోడ్డును వైసీపీ నాయకుడు బెదిరించి ధ్వంసం చేయించడంపై 'మీరు రోడ్డేస్తే.. మేం తవ్వేస్తాం!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురించిన కథనం కలకలం రేపింది. అసలు ఏం జరిగింది? రోడ్డును ఎందుకు ధ్వంసం చేశారనే దానిపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. నాయనపల్లిలో ఏం జరిగిందో వివరణ ఇవ్వాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల అధికారులు హుటాహుటిన గ్రామానికి వెళ్లి పరిశీలించి, జిల్లా అధికారికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. రోడ్డు ధ్వంసం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పాలనలో తట్టెడు మన్ను వేసింది లేదు, సీసీ రోడ్డు నిర్మించింది లేదంటూ మండిపడుతున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో వేరే ప్రాంతానికి చెందిన ఎంపీ నిధుల ద్వారా రోడ్డు వేస్తే దానిని వైసీపీ నాయకుడు బెదిరించి, కాంట్రాక్టర్ ద్వారా ధ్వంసం చేయించడం ఏంటని మండిపడుతున్నారు.

వేసిందే వేలం.. చెప్పిందే రేటు..!



చేతి ధరలు రాసి చింతపండుపై పెట్టిన దృశ్యం



- ఈ నామ్‌కు ఎగనామం
- చేతి వేలంతోనే కొనసాగింపు
- వేలం పాడేది.. కొనేది ఒక్కరే..
- మార్కెట్‌కు వచ్చేది కొండంత.. చూపేది గోరంత..
- ఈనామ్ అమలైతే ఆదాయం పది రెట్లు

● పురం మార్కెట్ యార్డులో రైతుల నిలువు దోపిడీ



చేతి వేలంతో చింత పండు ధర నిర్ణయిస్తున్న ఏజెంట్లు, వ్యాపారులు

హిందూపురం

తీవ్ర వర్షాభావం, గిట్టుబాటు ధర లభించక అన్నదాత నష్టాలపాలవుతున్నాడు. ఇది చాలదన్నట్లు పండిన కాస్తో.. కూస్తో పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కి వెళితే అక్కడ కూడా నిలువునా దోపిడీ చేస్తున్నారు. ఇందుకు దేశంలోనే చింత పండు మార్కెట్‌గా గుర్తింపు పొందిన హిందూపురం మార్కెట్ యార్డులో చింత, మిర్చి రైతులు నిలువు దోపిడీ అవుతుండడమే నిదర్శనం. మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల గుప్తాధిపత్యం కింద ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలు నలిగిపోతున్నారు. కొన్నేళ్లుగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతన్నను నిలువునా దోచేస్తున్నారు. వేలం పాట అంటే ఎక్కడైనా రూపాయి రూపాయి పెంచుతూ పోతారు. హిందూపురం యార్డులో మాత్రం కమిషన్ ఏజెంట్ ధర నిర్ణయించాక వేలం తగ్గించుకుంటూ పాడే పరిస్థితి ఉంది. ఎన్నో ఏళ్లుగా చింత రైతులను ఇలానే నిలువు దోపిడీ చేస్తున్నారు. దీనిని నిలువరించేందుకు ప్రభుత్వం ఈనామ్ తీసుకొచ్చినా ప్రకటనలకే పరిమితమైంది తప్ప.. అమలు చేసే నాథుడే కరువయ్యాడు.

ఈనామ్‌కు తూట్లు

మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల్లో పారదర్శకతను తీసుకువచ్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వాలు కొత్త విధానానికి శ్రీకరా చుట్టింది. ఆన్‌లైన్ ద్వారా సరుకును కొనుగోలు చేయడానికి ఈ-నామ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. వ్యాపారులకు దేశవ్యాప్త ఏకీకృత లైసెన్సును జారీ చేయడం, ప్రైవేటు మార్కెట్లకు అవకాశం కల్పించడం వంటి అవకాశాలు ఈ బిడ్డింగ్‌లో కల్పించారు. ఈనామ్ ప్రవేశపెట్టిన నాటి నుంచి రైతులను ముందు పెట్టి కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. బలవంతంగా ఈనామ్ నిర్వహించాల్సి వస్తే కొంత సరుకును ఆ విధానం కింద చూపి అదికూడా చేతి ధరలు వేసి ధర తక్కువ చూపుతున్నారు. ఆలస్యం చేయడంతోపాటు చేతి ధర కంటే తక్కువ ధరకు బిడ్డింగ్ చేస్తుండడంతో రైతులు.. ఈనామ్‌పై ఆందోళన చెందుతున్నారు. పురం మార్కెట్‌కు 100 ఏళ్ల చరిత్ర ఉండగా.. కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్స్ వంశపారంపర్యంగా వస్తూ చెప్పిందే వేదంగా నడుస్తోంది. మార్కెట్‌లో జీరో వ్యాపారం అత్యధికంగా సాగుతున్న తరుణంలో ఈ బిడ్డింగ్ ద్వారా కోట్ల రూపాయలు నిర్వహించే తమ లావాదేవీలు బయటపడే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు ఆందోళన పడుతున్నారు. ఇందులో ఈనామ్ వ్యతిరేకత వస్తోంది. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్, వ్యాపారి ఒకరే కావడంతో కొనుగోళ్ల వ్యవహారం బయటపడుతుందని ఆదోళన చెందుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన చింతపండులో పది శాతమే రికార్డు చూపి, భారీ మొత్తంలో శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచడంతోపాటు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో వారంలో రూ.100 కోట్లకు పైగా వ్యాపారం సాగుతుందని అంచనా.

ఒక ఏజెంట్ వద్ద ఒక్కరే ట్రేడర్

మార్కెట్ యార్డులో ట్రేడర్లతో సమానంగా కమీషన్ ఏజెంట్లు ఉండడం గమనార్హం. కమీషన్ ఏజెంట్ల ఆధీనంలో మండీలు ఉండడంతో మార్కెట్‌లోకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యార్డులో ట్రేడర్స్ 129 మంది, కమీషన్ ఏజెంట్లు 130 మంది ఉన్నారు. అందరూ ఒకేసారి ఉదయం 9 గంటలకు వేలంపాట ప్రారంభిస్తారు. దీంతో ఒక్కో ఏజెంట్ వద్దకు ఒక్కో వ్యాపారి మాత్రమే చేరుకుంటారు. కమీషన్ ఏజెంట్, వ్యాపారి నిర్ణయించిన ధరకే రైతు విక్రయించాలి. ఒకసారి వేలంపాట రద్దు చేసుకుంటే మళ్లీ అమ్ముకోవడానికి వ్యాపారి కాళ్లావేళ్లా పడాల్సిందే. అయినా ధర మాత్రం మొదటి దాని కంటే తక్కువగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో రైతులు, చిరు వ్యాపారులు.. వ్యాపారి చెప్పిన ధరకు శిరసావహించాల్సిందే. కమీషన్ రూ.100కి రెండు రూపాయలు తీసుకోవాలని నిబంధనలు ఉన్నా.. 8 నుంచి 10 శాతం వరకు వసూలు చేస్తున్నారు. వేలం పాట సమయంలో మార్కెట్ సిబ్బంది వెళ్లాల్సి ఉన్నా.. ఇక్కడ కమీషన్ ఏజెంటు, వ్యాపారే నిర్ణయించే పరిస్థితి నెలకొంది. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల దెబ్బకు రైతు కోలుకోలేకపోతున్నాడు. రోజూ మార్కెట్‌లోని మండీలకు ఎంత చింతపండు వచ్చిందో రికార్డు చేసి, వేలం వేయాల్సి ఉంది. పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వేలం పాట పూర్తయి, చింతపండు బయటకు తరలిన తరువాత నామమాత్రంగా రికార్డులు చూపిస్తున్నారు. సీజన్‌లో వందల కోట్ల వ్యాపారం సాగుతున్నా మార్కెట్ యార్డు ఆదాయం కోటి రూపాయలు దాటడంలేదని తెలుస్తోంది.

వేలంపాటలో తిరకాసు

దేశంలోనే ఇలాంటి వేలం విధానం ఎక్కడా ఉండదని చెప్పవచ్చు. ఎటువంటి పంటకైనా సాధారణంగా ధర పెంచుతూ వేలం పాట సాగుతుంది. పురం మార్కెట్ యార్డులో మాత్రం వేలంపాట గురించి తెలుసుకుంటే ఇంత అన్యాయంగా జరుగుతుందా అన్న ఆశ్చర్యం కలగకమానదు. చింతపండును రైతు మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చి అమ్మకానికి ఉంచుతాడు. అక్కడ ముందుగానే కమీషన్ ఏజెంట్ పది కేజీల టోకు ప్రకారం ధర నిర్ణయిస్తారు. తరువాత వేలంపాట పాడినా ధర క్రమంగా పెంచాలి. ఇక్కడ మాత్రం తిరకాసు రూపంలో కొనుగోలుదారులు తగ్గించుకుంటూ వేలంపాట పాడుతారు. కమీషన్ ఏజెంట్ పది కిలోల చింతపండును రూ.1000 ప్రకారం ధర నిర్ణయించినా వ్యాపారులు అంతకంటే తక్కువ ధరకు వేలం పలుకుతారు. ధరలు పెంచి పాడితే వేలం కానీ తగ్గించే విధానమేమిటో బహిరంగంగా చెప్పలేనిదిగా ఉంది. ఈ విధానాన్ని రద్దు చేయాలని చాలాసార్లు మార్కెట్ అధికారులు, ప్రభుత్వం ప్రయత్నించినా ఇది అమల్లోకి మాత్రం రాలేదు. ఈ తిరకాసు వేలం వల్ల గిట్టుబాటు ధర పలికే చింతపండు కూడా తక్కువ ధరకే అమ్మాల్సి ఉంటుంది.

యార్డు ఆదాయానికి భారీగా గండి

వ్యవసాయ మార్కెట్ యార్డుకు రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి భారీగా చింతపండు వస్తోంది. జనవరిలో మొదలై మే వరకు మార్కెట్ నడుస్తోంది. ఈ ఐదు నెలల కాలంలో దాదాపు వేల టన్నుల చింతపండు వస్తుంది. ఇందులో కర్పూలీ, ఫ్లవర్, బోటు రకాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయి. చింతపండు కొనుగోలు చేసేందుకు స్థానిక వ్యాపారులతోపాటు విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కడప, హైదరాబాద్ దక్షిణ భారత దేశంలోని చెన్నై, బెంగళూరు, రాజధాని ఢిల్లీ నుంచి సైతం వ్యాపారులు వస్తుండడంతో ధరలు పలుకుతున్నాయి. పురం మార్కెట్‌లో దొరికే కర్పూలీ రకానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. సీజన్‌లో ప్రతివారం ప్రతి కమీషన్ ఏజెంట్ వద్ద సగటున రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వ్యాపారం సాగుతుంది. రైతుల నుంచి నూటికి రూ.8 వరకు వసూలు చేసి రికార్డులు చూపించి అటు మార్కెట్ ఆదాయానికి కోతవేస్తున్నారు. ఏటా సగటున మార్కెట్ ఆదాయానికి రూ.రెండు కోట్లు వస్తుండంగా.. రూ.10 కోట్లకుపైగా టోకరా పెడుతున్నారు. రైతును నిలువుదోపిడితోపాటు మార్కెట్ ఆదాయానికి భారీ గండికొడుతున్న మార్కెట్ ఇంత జరుగుతున్న మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. చింత పండు కొనుగోలుదారులు తూకాలు తీసుకొచ్చే సంచుల్లో ఒక్కోటి బరువు 100 నుంచి 200 గ్రాములు ఉంటుంది. రైతు నుంచి కిలో నుంచి 1.20 కేజీల కోత వేస్తారు. మార్కెట్‌కు వంద కేజీల చింతపండు తీసుకొస్తే రైతు పట్టీలోకి 90కేజీలు మాత్రమే మిగులుతుంది. క్వింటాల్ చింతపండుకు 30 కేజీల చొప్పున మూడు సంచులు తూకాలు వేసే కూలీలకు 10 కేజీలు పోతుందని రైతులు వాపోతుంటారు. ఈ ఏడాది నూతన మార్కెట్ కార్యవర్గం కొలువుతీరింది. దీంతోపాటు నూతనంగా కార్యదర్శి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఏ రీతిలో మార్కెట్ అమలు అవుతుందో రైతుకు ఎంతమేర న్యాయం చేకూరుతుందో చూడాలి.

రైతన్న నిలువు దోపిడీ



ఏడాదిపాటు రైతన్న కుటుంబం మొత్తం కాయ కష్టం చేసి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువస్తే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రాబందుల్లా వాలిపోతున్నారు. యార్డులోకి చింతపండుతో వెళ్లినప్పటి నుంచి నగదుతో బయట పడే వరకు రైతు దోపిడీకి గురౌతున్నాడు. ట్రేడర్, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై ధరలు తగ్గించడం ఓవైపు, హమాలీలు చేతిపట్టు మరోవైపున దోచేస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చే రీతిలో వ్యాపారులు ఏకంగా పది శాతానికి పైగా కమీషన్లకు పాల్పడుతున్నా నివారించాల్సిన పర్యవేక్షకులు అటువైపు కన్నెత్తిచూసిన దాఖలాలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కమీషన్ రూపంలో రైతుల నుంచి వస్తు రూపేనా లాగేసుకుంటున్న దాని విలువ రోజుకు అరకోటికి పైగానే ఉంటుంది. పంటను తీసుకొచ్చిన రైతు వెనక్కి తీసుకుపోలేక కమీషన్ ఏజెంట్ నిర్ణయించిన ధరకి విక్రయిస్తున్నాడు. ఈ దోపిడీని తట్టుకోలేక కొంతమంది రైతులు గ్రామాల్లోనే చింతపండును అమ్మేసుకుంటున్నారు. అడుగడుగునా మోసం జరుగుతున్నా.. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు మార్కెట్ అధికారులు జంకుతున్నారు.

రైతు నష్టపోకూండా చర్యలు తీసుకుంటాం

మార్కెట్ యార్డులో చింతపండు, మిర్చి విక్రయాలు ఈనామ్ విధానం ద్వారానే కొనసాగిస్తాం. ఈబిడ్డింగ్‌లోనే ఉత్పత్తులు వందశాతం నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపడతాం. మార్కెట్‌లో 70నుంచి 80శాతం వరకు ఈనామ్ అమలవుతోంది. వచ్చేనెల నుంచి వందశాతం అమలుకు చర్యలు తీసుకుంటాం.

- చంద్రమౌళి, మార్కెట్‌యార్డు ప్రథమశ్రేణి కార్యదర్శి, హిందూపురం

భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- రైతులకు భూమి, పేదలకు ఇంటిపట్టాలు పంపిణీ చేయాలి
- కలెక్టరేట్ వద్ద రైతులు, కూలీల నిరసన

పుట్టపర్తి, జనవరి 29: ప్రభుత్వం తీసుకున్న భూములకు ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయం కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు, కూలీలు సోమవారం స్థానిక కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం పేద, దళితుల భూములను లాక్కుందనీ, వాటికి ఆర్ అండ్‌ఆర్ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. భూనిర్వాసిత రైతులందరికీ భూమి పంపిణీ చేయాలనీ, పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయకపోతే రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. జేసీ అభిషేక్ కుమార్ నిరసన కారుల వద్దకు వచ్చి పదిరోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రొద్దం, సోమందేపల్లి, చిలమత్తూరు, పాలసముద్రం ప్రాంతాలకు చెందిన భూనిర్వాసితులతోపాటు నేతలు ఇంతియాజ్, పెద్దన్న, హనుమయ్య, గంగాధర్, నారాయణ, వెంకటేష్, వర్షిణి, అశ్విని పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, కూలీలు

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

- పెన్షనర్ల డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పుట్టపర్తి, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణయ్య డిమాండ్ చేశారు. జిల్లాలోని పెన్షనర్లు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలనీ, అన్ని వ్యాధులకు హెల్త్‌కార్డు వర్తింపజేసి, ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చూడాలనీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.5లక్షలకు పెంచాలని కోరారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పెన్షనర్లు ఆంజనేయులు, రామప్ప, గఫూర్‌సాబ్, శివయ్య, కోనప్ప, వెంకటరరత్నం, సుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, అశోక్ గుప్తా, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు

పుట్టపర్తి, జనవరి 29: ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు ఆరోరోజు సోమవారం రిలేదీక్షలు కొనసాగించారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద దీక్షాశిబిరంలో ఆ సంఘం నాయకుడు రమణప్ప మాట్లాడుతూ.. ఉద్యోగభద్రత కల్పించాలనీ, హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలనీ, ఉద్యోగ విరమణ వయసు 26 ఏళ్లకు పెంచాలనీ, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామేశ్వర్‌రెడ్డి, రామమోహన్, రామిరెడ్డి, సుధాకర్, గోపాల్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు

అవినీతిని ప్రశ్నిస్తారనే సమావేశానికి ఎమ్మెల్యే దూరం

- తిప్పేస్వామిపై వైసీపీ నేతల విమర్శలు

మడకశిరటౌన్, జనవరి 29: తన అవినీతిని ప్రశ్నిస్తారేనన్న భయంతోనే నియోజకవర్గ సమావేశానికి దూరంగా ఉన్నారని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సే గౌడ్ విమర్శలు గుప్పించారు. వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు అశోక్‌బాబు సమాచారం ఇచ్చినా.. ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం, నిందలు మోపడం సరికాదన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి ఇంట్లో వైసీపీ నేతలు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తల నుంచి ప్రతి పనికి డబ్బు గుంజుకొన్న ఘనుడు ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. ఎమ్మెల్యే గ్రామాల్లోకి వెళ్లాలంటే పోలీసులను ముందు పెట్టుకుని వెళుతున్నారన్నారు. పోలీసులు లేకుండా గ్రామాల్లో పర్యటించగలవా అని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అవినీతిని ఆధారాలతో నిరూపించవచ్చని, పార్టీకి చెడ్డ పేరు వస్తుందన్న ఉద్దేశంతో మౌనంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జీబీ శివకుమార్, గుడిబండ జడ్పీటీసీ భూతరాజు పాల్గొన్నారు.



← మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

బీఎల్వోలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

గాండ్లపెంట, జనవరి 29: మండలంలోని ఓటర్ల తుదిజాబితాలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారి పేర్లు బూత్ లెవల్ అధికారులు తొలగించలేదని టీడీపీ నాయకులు సోమవారం మండలకేంద్రంలో తహసీల్దార్ హమీద్‌బాషాను కలిసి ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లను బీఎల్వోలు తొలగించకుండా అలాగే ఉంచారని తెలిపారు. ఎన్నికల అధికారులు ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాయడం ఏమిటని విమర్శించారు. వెంటనే చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, గంగరాజు, చంద్ర, శివప్పనాయుడు, అక్రమ్, దాదాపీర్, యూనస్, మునాఫ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు


ఒక్కొక్కరికి రెండు, మూడు ఓట్లు




గిరక నాగజ్యోతి పేరు మీద మూడు ఓట్లు

ధర్మవరం రూరల్, జనవరి 29: మండలంలోని గొట్లూరు గ్రామంలో ఓటర్ల జాబితాలో మళ్లీ అవే తప్పులు వచ్చాయి. డబుల్ ఓట్లు తొలగించాలని బీఎల్ఓలతో కలిసి పార్టీల ప్రతినిధులు ఇళ్ల వద్దకు వెళ్లి సర్వేచేసి గుర్తించారు. వీటిని తొలగించాలనీ, తప్పులు లేని తుది ఓటరు జాబితా విడుదల చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను సైతం తొంగలో తొక్కిన బీఎల్ఓలు మళ్లీ అవే తప్పులు చేశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో 145వ పోలింగ్‌బూత్‌లో సీరియల్ నంబర్లు 116, 117, 1200లో గిరక నాగజ్యోతి పేరు మీద మూడు ఓట్లు వచ్చాయి. అదే బూత్ పరిధిలో 904, 905 సీరియల్ నంబర్లలో సతీష్‌కుమార్ మండల పేరుమీద డబుల్ ఓట్లు వచ్చాయి. సీరియల్ నంబర్ 9లో హసీనా షేక్ మహిళ ఓటరు గ్రామంలో ఉన్నప్పటికీ తొలగింపు జాబితాలో చేర్చారు. అధికారుల నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.


చనిపోయినా.. ఓటు యథాతథం..



ఓటరు జాబితాలో మృతులు హుస్సేన్‌పీరా, ముష్టూరు బాబు పేర్లు

ముదిగుబ్బ: ఓటర్ల తుది జాబితాలోనూ మృతుల ఓట్ల ను తొలగించలేదు. మండల వ్యాప్తంగా అవే తప్పులు పునరావృతమయ్యాయి. ముదిగుబ్బలోని 67వ పోలింగ్‌బూత్‌పరిధిలో రాళ్లపల్లి హుస్సేన్‌పీరా, ముష్టూర్ బాబు రెండేళ్ల క్రితం చనిపోయారు. బీఎల్ఓలకు రాజకీయ పార్టీ నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఓటరు జాబితాలో వారి ఓట్లను తొలగించలేదు. కుటుంబ సభ్యుల నుంచి మృతిచెందిన ఓటర్ల మరణ ధృవీకరణపత్రాలు కూడా తీసుకున్నట్లు సమాచారం. 67వ పోలింగ్‌బూత్‌లో దాదాపు 15 ఓట్లు వరకు మరణించిన వారివి తొలగించలేదని రాజకీయ పార్టీ నాయకులు వాపోతున్నారు.

తప్పులతడకగా జక్కేపల్లి ఓటరు జాబితా



మృతిచెందిన వారి ఓట్లను అలాగే ఉంచిన దృశ్యం

మడకశిర రూరల్, జనవరి 29: మండలంలోని జక్కేపల్లిలో 206 పోలింగ్ కేంద్రం పరిధిలో 13, 160, 204, 34, 134, 276, 70, 87, 198, 141, 109, 224 సీరియల్ నంబర్లలోని ఓటర్లు మొత్తం 12 మంది మృతిచెందారు. ఓటర్లు జాబితాలో మాత్రం వారు బతికే ఉన్నారు. 207వ పోలింగ్ కేంద్రం పరిధిలో సీరియల్ నంబర్లు 375, 250, 236, 215, 134, 67, 252, 238, 236, 104, 93, 30లో మొత్తం 12 మంది మృతి చెందారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో 24 మంది మృతి చెందిన వారి ఓట్లను జాబితాలో అలాగే ఉంచారు.

ఒకే కేంద్రం పరిధిలో 110 మంది..



మృతిచెందిన లక్ష్మీనారాయణ, పెద్ద ఓబిలేసు

శింగనమల: ఓటరు తుది జాబితాలో మృతుల పేర్లు కుప్పలు తెప్పలుగా బయటపడుతున్నాయి. శింగనమల మండలంలోని రాచేపల్లిలో.. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఏకంగా 110 మంది మృతుల పేర్లు ఉన్నాయి. రాచేపల్లి 60వ పోలింగ్ కేంద్రం పరిధిలో 900 మంది ఓటర్లు ఉన్నట్లు తుది జాబితాలో చూపించారు. ఇందులో 110 మంది కొన్నేళ్ల క్రితమే చనిపోయారు. సుబ్బన్నగారి రవీంద్ర (సీరియల్ నంబరు 31), నారప్ప (సీరియల్ నంబరు 36), ఎర్రమ్మ (సీరియల్ నంబరు 225), ఓబుళమ్మ(232), మేకల తిరుపతయ్య(335) ఎరికల నారాయణస్వామి (283) ఇలా చాలామంది చనిపోయారు. అయినా వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదు.

సీఐలు.. ఎస్ఐల బదిలీ

పుట్టపర్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఆదేశాలు జారీచేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న కృష్ణమరాజు నాయక్‌ను ముదిగుబ్బ సర్కిల్‌కు, ముదిగుబ్బ సీఐ యతీంద్రను ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పీఎస్‌కు బదిలీ చేశారు. అమరాపురం ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లును రామగిరి పోలీస్ స్టేషన్‌కు, పుట్టపర్తి అర్బన్ ఎస్ఐ వీరేష్‌ను అగళికి, పుట్టపర్తి డీసీటీలో పనిచేస్తున్న క్రిష్ణవేణిని గాండ్లపెంటకు, కొత్తచెరువు ఎస్ఐ సురేష్‌బాబును బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌కు, ముదిగుబ్బ ఎస్ఐ వంశీకష్ణను ఓడీచెరువుకు బదిలీ చేశారు. నల్లమాడ ఎస్ఐ వరలక్ష్మీదేవిని పుట్టపర్తిలోని దిశ మహిళ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

యువరైతు ఆత్మహత్య



మృతిచెందిన రైతు మురళీమోహన్

రామగిరి, జనవరి 29: మండలంలోని గంగంపల్లి గ్రామంలో మురళీమోహన్(34) అనే యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ట్లు గ్రామస్థులు తె లిపారు. యువరై తు మురళీమోహన్‌కు 10 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం 3గంటల సమయంలో తోట వద్ద నున్న పశువుల పాకలో ఉరివేసుకుని మృతిచెందాడు. తోటలోకి వెళ్లి చూసిన కుటుంబసభ్యులు వెంటనే గ్రామస్థులకు తెలియజేశారు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేపట్టారు. మృతుడికి భార్య బార్గవి ఉంది. రైతు ఆత్మహత్యకుగల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్మలను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01243, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

వారసత్వం వైపు... టీడీపీ చూపు!

- అధినేత, యువనేత మదిలో అదే యోచన
- రేసులో పరిటాల శ్రీరామ్, పల్లె సింధూర, జేసీ అశ్మిత్‌రెడ్డి, సవితమ్మ



పరిటాల శ్రీరామ్



సవితమ్మ



జేసీ అశ్మిత్ రెడ్డి



పల్లె సింధూర

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గెలుపుగుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలన్న యోచనలో ఆ పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై టీడీపీ అధిష్ఠానం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. యువత, బీసీ వర్గాలు, మహిళలకు టిక్కెట్ల కేటాయింపులో పెద్దపీట వేయాలని ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తాజా గా ఉరవకొండలో రా.. కదలిరా బహిరంగ సభ అనంతరం ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అంతర్గత సమావేశం నిర్వహించిన సందర్భంలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. యువతకు 40 శాతం టిక్కెట్లు ఇవ్వాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. బీసీ నాయకులు, మహిళలకు ఈ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే... ఉమ్మడి జిల్లాలో మరీ ముఖ్యంగా వారసత్వం వైపు ఆ పార్టీ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మదిలోనూ అదే యోచన ఉన్నట్లు సమాచారం. పరిటాల కుటుంబం నుంచి పరిటాల శ్రీరామ్, జేసీ కుటుంబం నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి, పల్లె కుటుంబం నుంచి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూర, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుటుంబం నుంచి సవితమ్మకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఆ మేరకు ఆ పార్టీ నియమించిన బృందాలు సర్వేలో నిమగ్నమయ్యాయి. తొలి నుంచి ఆ కుటుంబాలు తెలుగుదేశం పార్టీకి విధేయులుగా కొనసాగుతున్న నేపథ్యంలోనే వారసత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీలో యువతకు పెద్దపీట వేయాలని పార్టీ అధినాయకత్వం భావిస్తున్న తరుణంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సామాజిక కోణాన్ని పరిగణలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా... వారసత్వ రాజకీయాల్లో భాగంగా... ఇప్పటికే పరిటాల శ్రీరామ్, జేసీ అశ్మిత్‌రెడ్డి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన విషయం తెలిసిందే. ఈసారి ఎన్నికల్లో ఆ ఇద్దరు యువ నేతలకు టిక్కెట్లు ఖరారు చేయాలనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి, టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీ నేతగా పనిచేసి పార్టీలో తనదైన ముద్ర వేసుకున్న దివంగత రామచంద్రారెడ్డి కుమార్తె, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మకు అవకాశమివ్వాలని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లోనూ సవితమ్మ టికెట్ ఆశించారు. ఈసారి ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయించాలనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీలో మరో ముఖ్యనేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబం నుంచి ఆయన కోడలు పల్లె సింధూర అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్టీ ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం. అయితే పల్లె రఘునాథరెడ్డి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

కుళ్లిన అంగన్‌వాడీ గుడ్లు



రాప్తాడు-2 అంగన్‌వాడీ కేంద్రంలో చెడిపోయిన గుడ్లు

రాప్తాడు, జనవరి 29: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం గ్రామ సచివాలయ సిబ్బంది సకాలంలో పంపిణీ చేయకపోవడంతో పాడైపోయాయి. కందిబ్యాళ్లు పుచ్చు పట్టి పురుగులు కనిపిస్తున్నాయి. గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు తమకు జీతాలు పెంచాలని 40 రోజులకుపైగా విధులకు హాజరుకాకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సమయంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహా రం పంపిణీ చేసే బాధ్యతను ప్రభుత్వం గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించింది. సచివాలయ సిబ్బంది పౌష్టికాహా రం కొన్ని గ్రామాల్లో కొంతమందికి సకాలంలో పంపిణీ చేయలేదు. దీని వల్ల కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం పాడైపోయాయి. అం గన్‌వాడీ సిబ్బంది ఇటీవల విధుల్లోకి చేరారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేసేటప్పుడు కందిబ్యాళ్లు పుచ్చుపట్టి పురుగులు పడ్డాయి. గుడ్లు కుళ్లిపోయాయి. పాల ప్యాకెట్లు కూడా గడ్డ కట్టాయి. పాడైన పౌష్టికాహారాన్నే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బండమీదపల్లిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కొంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన కందిబ్యాళ్లు, గుడ్లు పాడైపోయాయి. రాప్తాడులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సచివాలయ మహిళా పోలీసు సకాలంలో గుడ్లు పంపిణీ చేయకపోవడంతో కుళ్లిపోయాయి. వర్కర్ విధుల్లోకి చేరిన తరువాత వాటిని గుర్తించి ఒక వైపు ఉంచారు. ఆ గుడ్లు నిరుపయోగమేనని పారేయాల్సిందేనని తెలిపారు.

తిరుపతి ఎంపీ సీటుకు కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అనంతపురంలో వచ్చేనెల మొదటివారంలో జరిగే వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది. జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందని అన్నారు. టికెట్లు రానివారిని ఇతర పదవులతో పార్టీ సంతృప్తిపరుస్తుందని అన్నారు. రాయలసీమలో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు.

- పార్టీ ఆదేశిస్తే ఒంగోలుకు సిద్ధమే : మంత్రి రోజా

'ఆంధ్రజ్యోతి పత్రికకు నేనంటే చాలా ప్రేమ. ఒకసారి టికెట్ లేదంటారు. మరోసారి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తానంటారు. టీడీపీ, జనసేనకు నాయకులు లేక అభ్యర్థుల జాబితా విడుదల చేయలేకపోతున్నారు. నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడం లేదు. పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా నేను సిద్ధమే' అని మంత్రి రోజా అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి తీసుకునివుంటే నిరూపించాలన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఏపీలో రాజకీయాలు చేసే నాన్‌లోకల్ లీడర్లు ఎక్కువైపోయారంటూ ఎద్దేవా చేశారు.చంద్రబాబు, పవన్ మధ్యలో నాలుగో కృష్ణుడిలాగా షర్మిల ప్రవేశించిందన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ కుటుంబాన్ని ముక్కలు చేస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు.

- పలువురు నేతలు డుమ్మా

రాయలసీమ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ కోఆర్డినేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సీటు దక్కని ఎమ్మెల్యేలు మాత్రం డుమ్మా కొట్టారు.ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ భాషా, తిప్పేస్వామి సమావేశానికి రాలేదు. అదే విధంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, రాజంపేట, కదిరి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున్ రెడ్డి, సిద్దా రెడ్డి హాజరు కాలేదు. కొత్తగా నియమితులైన సమన్వయకర్తలు సమావేశంలో కనిపించారు.

పంట నష్టపరిహారం అందేనా..?!




- వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు
- కోత సమయానికి ముందే పంటను దున్నేసిన రైతులు
- రూ.251.20 కోట్ల పంటనష్టం జరిగినట్లు ప్రతిపాదనలు
- సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికలు
- ఎన్నికల కోడ్ అమలైతే అంతే సంగతులు

అనంతపురం అర్బన్/యాడికి, జనవరి 29: కరువు రైతుకు పంటనష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల కోడ్ అమలయ్యేలోగా పరిహారం మంజూరు చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. లేదంటే కరువు రైతులకు పరిహారం అందడం కష్టమే. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించి నెల రోజులు పూర్తయినా ఇప్పటి దాకా పరిహారం మంజూరుపై ప్రభుత్వం ఊసెత్తకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంలో నోరుమెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి పంటనష్టపరిహారం మంజూరు చేసి అర్హులైన రైతుల ఖాతాలకు జమ చేయకపోతే ఇప్పట్లో పరిహారం అందడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కరువు రైతులు తమకు పరిహారం ఇస్తారో? లేదోనన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. మరి ప్రభుత్వం ఏ మేరకు కరువు రైతుపై కనికరం చూపుతుందో వేచిచూడాల్సిందే.

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు

2023-24 సంవత్సరం ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు చేసిన పంటలకు దిగుబడి రాలేదు. వేరుశనగ, ఆముదం, పత్తి, కంది, జొన్న తదితర పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వేరుశనగ పంట ఊడదశలో వర్షాభావంతో పంట దిగుబడి రాలేదు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో కొన్ని చెట్లకు రెండు, మూడు కాయలు కాయగా, మరికొన్ని చెట్లకు కాయలే కాయలేదు. మరో వైపు వర్షాభావంతో పంటలు పొలాల్లోనే ఎండిపోయాయి. తమ కళ్లెదుటే పంట ఎండిపోవడంతో రైతులు చూడలేక అప్పట్లో దున్నేశారు. మరోసారి కరువు రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల పంటనష్టం

ఈ ఏడాది ఖరీఫ్‌లో 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల పంటనష్టం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు ప్రభుత్వానికి కరువు నివేదికలు పంపారు. వర్షాభావ పరిస్థితుల్లో 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసిన విస్తీర్ణంలో ఐదెకరాలకు, పెద్ద రైతులకు గరిష్ఠంగా ఐదెకరాల దాకా పంటనష్టం అంచనాలు తయారు చేశారు.

మూడు మండలాల రైతులకు అన్యాయం

జిల్లాలో 31 మండలాలు ఉండగా... 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలో మిగిలిన యల్లనూరు, బెళుగుప్ప, బొమ్మనహాల్ మండలాలను జాబితాలో చేర్చలేదు. మిగతా మండలాల్లో తరహాలోనే ఆయా మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తమ ప్రాంతాల్లోనూ వర్షాభావంతో పంటనష్టం జరిగిందని, కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వం, కేంద్ర కరువు బృందాన్ని బాధిత రైతులు వేడుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆయా మండలాల రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసినట్లైంది.

పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలి



గతేడాది ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో కంది సాగు చేశా. 40 వేలకుపైగా పెట్టుబడికి ఖర్చు అయ్యింది. వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోయింది. గొర్రెలు, పశువులకు పంటను వదిలేశా. వ్యవసాయ అధికారులు పొలంలోకి వచ్చి పంటనష్టం జరిగినట్లు నిర్ధారించారు. జాబితాలోనూ పేరు ఎక్కించారు. ఇప్పటి దాకా ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలి.

- ఖాశీ విశ్వనాథ్, కమలపాడు, యాడికి మండలం

పరిహారం ఎప్పుడిస్తారో... ఏమో?



ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. వర్షాలు సరిగా పడకపోవడంతో దిగుబడి రాలేదు. ఎకరాకు రూ.30వేలు దాకా పెట్టుబడి ఖర్చు అయ్యింది. వ్యవసాయ అధికారులు నిబంధనల పేరుతో ఐదెకరాల్లో పంట నష్టం జరిగినట్లు రాసుకొని వెళ్లారు. ఇప్పటి దాకా ఎలాంటి పరిహారం మంజూరు కాలేదు. పరిహారం డబ్బులు ఎప్పుడిస్తారో..? ఏమో అర్థం కావడం లేదు. ఎన్నికల కోడ్ వస్తే పంటనష్టపరిహారం మంజూరు చేసేందుకు అవకాశం లేదంటున్నారు. అప్పటిలోగా పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- శంకర్‌రెడ్డి, చిక్కేపల్లి, యాడికి మండలం

తెనగల్లులో పేలిన గ్యాస్ సిలిండర్

- ఆరుగురికి గాయాలు... ఇల్లు నేలమట్టం
- రూ. పది లక్షలకు పైగా ఆస్తి నష్టం



పేలిన సిలిండర్

కుందుర్పి, జనవరి 29: మండలంలోని తెనగల్లు గ్రామంలోని ఓ ఇంటిలో సోమవారం సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు నేలమట్టమయ్యింది. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తెనగల్లు గ్రామంలోని షేక్ ముస్తాబ్ ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లను ఉంచాడు. రాత్రంగా ఒక సిలిండర్ లీక్ అవుతుండగా, ఉదయం కరెంటు బల్బును ముస్తాబ్ ఆన్ చేశాడు. వెంటనే పొగలు వ్యాపించడంతో బయటకు కేకలు పెడుతూ వచ్చాడు. చుట్టుపక్కల వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న మరో సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మరో సిలిండర్ పెద్దశబ్దంతో పేలింది. వెంటనే మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో బాధితుడికి సహాయం చేయడానికి వచ్చిన ఆరుగురు గాయపడ్డారు. వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సిద్దేశ్వర, చౌడప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమరాజు, నారాయణస్వామి, రామాంజనేయులు, మారుతిలకు స్వల్ప గాయాలు కాగా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి అడిషనల్ ఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, ఏఈ నాగరాజు, ఎస్ఐ వెంకటస్వామి చేరుకుని స్థలాన్ని పరిశీలించి గ్యాస్ పేలేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ముస్తాబ్ చిల్లర దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనలో రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపాడు. ఫైరింజన్ సమయానికి చేరుకోవడంతో సిబ్బంది మంటలను ఆర్పారు. రెస్క్యూ టీమ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుపై పడివున్న రాళ్లను తొలగించారు. అనంతరం పేలిన గ్యాస్ సిలిండర్‌ను పరిశీలించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



సిలిండర్ పేలుడు ధాటికి నేలమట్టమైన ఇల్లు

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

CHANGE OF NAME
I, DADIREDDY SURYA SEKHAR REDDY (Aadhar No 376756958382) S/o D.Narasimha Reddy D.No 6-139, Main Road A.Kothapalli, Amadagur Post & Mandal 515556 Sathya Sai District changing My Name From Dadi Ready Surya sekhar Ready (OldName) To SuryaSekhara Reddy D (New Name) Hence forth i am being Called al SuryaSekhara Reddy D for all purpose
AJA-sudha

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA-150700

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి Goverment colleges లో B.Sc (Nursing).B.Sc (MLT),BPT(ఫిజియోథెరపీ)GNM (Nursing) DMLT (బ్లడ్ టెస్ట్ కోర్సు) నందు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు కాలేజీలోనే హాస్టల్ వసతి కలదు.సంప్రః జి.మురళి,అనంతపురం సెల్ : 9030661651
AJA-150699

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వైసీపీ ఓడిపోవడం ఖాయం: మాజీ మంత్రి పల్లె



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి, జనవరి 29: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమని, సీ ఎం వైఎస్ జగన్ ప్రజల తిరుగుబాటు ను ఊహించి ముందుగానే ఓటమిని ఒ ప్పుకుంటున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయ న విలేకరులతో మాట్లాడారు. జగన్ చేసిన అరాచకాలతో ప్రజల్లో తిరుగుబాటు మొ దలైందన్నారు. దీంతో భయపడి జగన్ ముందుగానే ఓటమిని ఒప్పుకుంటున్నారని అన్నారు. గతంలో ఎవరూ.. నా వెంట్రుక కూడా పీకలేరని ప్రగల్భాలు పలికిన జగన్, ఇప్పుడు హ్యాపీగా దిగిపోతా అంటున్నారని, దీన్ని బట్టి చూస్తే అతడికి ఓటమి భయం పట్టుకుందనే విషయం అర్థమవుతోందని తెలిపారు. ఐదేళ్లుగా ప్రజావనరులను దోచుకుని, లక్షల కోట్ల రూపాయలు వెనుకవేసుకున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేదలు, సామాన్యుల నడ్డి విరిచారని మండిపడ్డారు. నవరత్నాల పేరుతో అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేశారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రజలకు ఒరిగేందేమీ లేదన్నారు. అవి నవరత్నాలు కాదని, నకిలీ రత్రాలని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఇంటికెళ్లడం, టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రపంచాన్ని నాయకత్వమే నడిపిస్తోంది: కందికుంట



సదస్సులో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జనవరి 29: ప్రపంచాన్ని ముందుకు నడిపించేది సరైన నాయకత్వమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని అమృత ఫంక్షన్‌హాల్లో సోమవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్ర మానికి కందికుంట ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచాన్ని ముందుకు నడిపించేది సరైన నాయకత్వమేనన్నారు. ఏ విభాగంలో అయినా సమర్థవంతమైన నాయకత్వముంటేనే ఆ విభాగం సజావుగా ముందుకు పోతుందన్నారు. రాజకీయ నాయకులు మాత్రమే నాయకులు కాదని, కార్మిక, కర్షక, విద్యార్థి రంగాల్లో సైతం ముందుండి నడిపించేది నాయకులేనని తెలిపారు. యువకులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఏరంగానికెళ్లినా .. సమర్థవంతంగా రాణించాలంటే మంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. యువతను ప్రస్తుత ప్రభుత్వం మోసగించిందని, ప్రతియువకుడు ఈవిషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. ప్రతి సంవత్సరం జాబ్‌క్యాలెండ ర్ పేరుతో సీఎం జగన్ యువతను మోసగించారన్నారు. ఓటు అనే ఆయుధంతో సమాధానం చెప్పాలని తెలిపారు. జనసేన నాయకుడు శివశంకర్ మాట్లాడుతూ ప్రతి యువకుడు వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమానికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకుడు చింతానాగరాజు అధ్యక్షత వహించారు. వక్తలు ఉమాదేవి, ఉద్దండం చంద్రశేఖర్, టీడీపీ నాయకులు కొయ్యరాజేంద్రనాయుడు, మహమ్మద్ అలీ, టీ ఎన్ఎస్ఎఫ్ నాయకులు సల్మాన్‌ఖాన్, వంశీ పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తనకల్లు, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని నక్కరాళ్ల తండాకు చెందిన గోపాల్‌నాయక్ (40) సోమవారం మృతిచెందారు. బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడురోజులక్రితం గోపాల్‌నాయక్ బైక్‌లో కదిరిలోని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి, తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలోని తనకల్లుకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 వాహ నంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమారై ఉన్నారు. గోపాల్‌నాయక్ గ్రామంలో ప్రైవేటు విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడని, అతడి మృతితో కుటుంబసభ్యులు దిక్కులేనివారయ్యారని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. పిల్లల చదువుకోసం దాతలు సాయం చేయాలన్నారు.

పోలీస్ స్పందనకు 41 వినతులు



స్పందనలో పాల్గొన్న ఎస్పీ, ఫిర్యాదుదారులు

పుట్టపర్తి రూరల్, జనవరి 29: జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 41వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతి పత్రాలను ఇచ్చారు. ఎస్పీ మాధవరెడ్డి వాటిని స్వీకరించి పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పోలీసు చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీకి అందిన ఫిర్యాదుల్లో ఎక్కువగా భూసమస్యలు, రస్తా వివాదాలు, కుటుంబకలహాలు ఆర్థికమోసాలు, సైబర్‌నేరాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, జిల్లాక్రైం బ్రాంచ్ సీఐ శ్రీహర్ష, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి సారూ..

● స్పందనలో కలెక్టర్‌కు దివ్యాంగురాలి వినతి



కలెక్టరేట్ వద్ద దివ్యాంగురాలు మోహిత

పుట్టపర్తి, జనవరి 29: కదల్లేని స్థితిలో డిగ్రీ చదివినా, ఉద్యోగం రాలేదు. కదలేని స్థితిలో ఉన్నాను, ఉపాధి చూపించాలంటూ మోహిత అనే దివ్యాంగురాలు కలెక్టర్ అరుణ్‌బాబుకు విన్నవించారు. గోరంట్ల మండలం మందలపల్లికి చెందిన మోహిత సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరే ట్‌కు చేరుకుని స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను డిగ్రీ పాసవడంతో పాటు టైప్ నేర్చుకున్నానని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ ఆ వినతులను అన్నింటినీ స్వీకరించి పరిశీలించారు. సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్, జనవరి 29: భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు నాగప్ప, ఇలియాజ్ మాట్లాడుతూ.. కదిరిలోని సర్వేనెంబర్ 83, 1735-1ఎ లోగల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది పట్టాలు చేసుకుని అధిక ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వీరికి త హసీల్దార్ కార్యాలయ ఆర్ఐ ముస్విర్‌హుస్సేన్ సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఆర్సీపీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకునేవారకు రిలేదీక్ష కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, వరప్రసాద్, శేఖర్, హరీష్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు కాంగ్రెస్‌లోకి చేరిక

అమడగూరు, జనవరి 29: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పెద్దసాని నాగబయ్యారెడ్డి, వలంటీర్ సురేంద్రరెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని షర్మిల సూచించినట్లు వారు పేర్కొన్నారు.

పోలీస్ ఫైరింగ్‌కు స్థలం పరిశీలన

బుక్కపట్నం, జనవరి 29: మండలంలోని చంద్రాయునిపల్లి గ్రామ సమీపంలో పోలీస్ ఫైరింగ్‌కు స్థలాన్ని ఏఆర్ ఏఎస్పీ విజయకుమార్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ సత్యసాయి జిల్లా పోలీసుల ఫైరింగ్ శిక్షణ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. జిల్లా కేంద్రానికి అతి దగ్గర గా.. ఫైరింగ్‌కు అనుకూలంగా స్థలం ఉందని, దీనిని చదును చేసి, త్వరలోనే ఫైరింగ్ రెయింజ్‌కు శిక్షణ ప్రారంభిస్తామని అన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ రమణ, సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

నల్లమాడ, జనవరి 29: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ సునీతాబాయి అధ్యక్షతన జరిగింది. ఇందులో ఏఓ సుమతి మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతులందరూ ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలా చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి సబ్సిడీలు రావని తెలిపారు. లబ్ధిదారులకు హౌసింగ్ బిల్లులు రాలేదని పలువురు సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. ఇళ్లు కట్టినవారందరికీ బిల్లులు పెట్టమని, నిధులు వచ్చినవెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు సమాధానమిచ్చారు. కొండకిందతండా సర్పంచ్ మంగేనాయక్ పలు సమస్యల్ని ఏకరువు పెట్టారు. గ్రామాల్లో నెలకున్న సమస్యలపై మాట్లాడితే అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులపై ఫిర్యాదు చేస్తాం: చిలకం మధు

ధర్మవరం, జనవరి 29: ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితాలోనూ తప్పుల తడకలు ఉన్నాయని, వాటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో సోమవారం ఆయన పట్టణ, రూరల్ బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ఈ సారి దొంగ ఓట్లతో ఎలాగైనా గెలుపొందాలని ప్రయత్నిస్తోందన్నారు. ఆ కుయుక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కావున ఓటరు జాబితాను తీసుకుని ప్రతింటికీ వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని సూచించారు. అనంతరం పార్టీ ధర్మవరం మండల కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా నాగసుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరికచిరంజీవి, శివ, శంకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులుగా చిరంజీవి, జయరాం, శైలజ, రాజశేఖర్‌రెడ్డి, రాజు, కార్యదర్శులుగా సుధాకర్, పెద్దన్న, షెక్షావలి, రవి, గోవింద రెడ్డి, బాబురెడ్డి, సుబ్బన్న, మౌలాలి, సంయుక్త కార్యదర్శులుగా రమేశ్, పి.రాజశేఖర్‌రెడ్డి, నాగార్జున, అంగజాల వంశీ, రాము, కృష్ణమూర్తి, ప్రతాప్‌ను ఎంపిక చేశారు. వారికి చిలకం మధుసూదన్‌రెడ్డి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మత్స్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, పట్టణ నాయకుడు అడ్డగిరి శ్యాంకుమార్, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కోటకి రామాంజి, పేరూరు శ్రీనివాసులు, దాడితోట లక్ష్మయ్య, బాలకృష్ణ, కోలా నాగార్జున, దాము, రాజప్రకాశ్, నీలూరు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోను ఇంటింటా వివరించండి

గాండ్లపెంట, జనవరి 29: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బూత్‌కన్వీనర్లకు, టీడీపీ శ్రేణులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణాధికారి రామసుబ్బమ్మ మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు ప్రతిఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలపై వివరించాలని సూచించారు. ఓటర్ల తుది జాబితాలో ఇంకా తప్పులు ఉంటే గుర్తించి సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, ఎంపీపీ గంగరాజు, నాయకులు చంద్ర, అక్రమ్, పవన్, కాకర్ల రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

కదిరి: తెలుగుదేశం పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలని టీడీపీ నాయకుడు డైమండ్ ఇర్షాన్ కోరారు. పట్టణంలోని ఎస్వీకే ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఇంటిగ్రేటెట్ శిక్షణను నిర్వహించారు. ఇందులో ఇర్షాన్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, మనోహర్‌నాయుడు, చంద్రశేఖర్, రెడ్డిబాషా, రమణ, హరిప్రసాద్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

పుట్టపర్తిరూరల్, జనవరి 29: జిల్లాలో జనాభారీత్యా అత్యధికంగా ఉన్న కురుబలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో సోమవారం కురుబల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో సామకోటి మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న జిల్లాల్లో బీసీలు అత్యధికంగా ఉన్నారని, అందులో కురుబలు అధిక శాతం ఉన్నారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు కురుబలకు సముచితమైన స్థానం కల్పించాలన్నారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే నాలుగు లక్షల పైచిలుకు కురుబలు ఉన్నారన్నారు. తమకు ప్రాధాన్యత కల్పించిన వారికే తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కురుబసంఘం తెలుగురాష్ట్రాల కార్యదర్శి బిల్లేమంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేసాని ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు శివానందం, టౌన్ అధ్యక్షుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలతో ఆర్డీఓ సమావేశం



ఓడీసీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాగ్యరేఖ

ఓబుళదేవరచెరువు, జనవరి 29: క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఓటరు జాబితాను సరి చేయాలని బీఎల్వోలకు ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె నల్లమాడ, ఓడీసీల మండలాల బీఎల్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్షేత్రస్థాయికెళ్లి ఇంటింటిలో విచారణ చేసి ఓటరు సవరణ చేయాలన్నారు. తప్పులుంటే అందుకు బీఎల్ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే గ్రామాల పెద్దలతో మమేకమై సరిచేయాలన్నారు. ఎటువంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గకూడదన్నారు. సమావేశంలో తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగేంద్ర, బీఎల్వోలు పాల్గొన్నారు.

అమడగూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ ఓటరు జాబితాను పరిశీలించారు. అనంతరం బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతుల గురించి ఆరా తీశారు. అలాగే జాబితాలో ఓటర్ల చేర్పులు, మార్పులు తదితరాంశాలపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

● కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌ను కోరిన కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న

ధర్మవరం, జనవరి 29: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ భవనంలో సోమవారం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ... మున్సిపల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ బండి శేషన్న దృష్టికి తెచ్చారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ గతంలో ఆరోపణలు వచ్చిన అధికారులు, సిబ్బందిపై విచారణ జరుగుతోందన్నారు. దోషులని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారికి అవకాశం ఇవ్వకుండా చూడాలని కౌన్సిలర్లు కోరారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ అధికారులు, కౌన్సిలర్లు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. తర్వాత బదిలీపై వెళ్లనున్న కమిషనర్ బండిశేషన్నను చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, అధికారులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

తైక్వాండోలో విద్యార్థికి గోల్డ్‌మెడల్

కదిరి, జనవరి 29: పట్టణానికి చెందిన సీవీ మనీష్‌కుమార్ తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు స్థానిక తైక్వాండో శిక్షకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27, 28 వ తేదీల్లో బెంగళూరులో జరిగిన నేషనల్ తైక్వాండో పోటీల్లో మనీష్‌కుమార్ పాల్గొని ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించినట్లు చెప్పారు. మనీష్ హైదరాబాదులోని వయాసిస్ పాఠశాలలో చదువుతున్నాడన్నారు. ఆ విద్యార్థిని చిన్నపిల్లల వైద్యుడు మదన్‌కుమార్, అడ్వకేట్ కృష్ణమూర్తి అభినందించారు.

పూజారులకు గౌరవవేతనం ఇవ్వాలి

ధర్మవరం, జనవరి 29: కురుబల గుడికట్ల సాంప్రదాయాలను, కట్టుబాట్లను భావితరాలకు అందిస్తున్న పూజారులకు, గురవయ్యలకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని సీపీఐ రాష్ట్రనాయకుడు జగదీశ్ కోరారు. పట్టణంలోని తారకరామాపురం అక్కమ్మ ఆలయంలో సోమవారం ఆయన మన గుడికట్లు-మనసంప్రదాయం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుడికట్లు సంప్రదాయాలను, కట్టుబాట్లను బావితరాలకు అందిస్తున్న పూజారులకు , గురవయ్యలకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముసుగుమధు, పామాల కులశేఖర్, పాలసూరి, గుంజర శివయ్య, బుడగ వెంకటనారాయణ, మల్లికార్జున, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో ల్యాబ్ ప్రారంభం

కదిరిఅర్బన్, జనవరి 29: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్ తెలిపారు. ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలను ప్రదర్శించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టార్టర్ చోరీపై ఫిర్యాదు

నల్లమాడ, జనవరి 29: మండలంలోని చెరువువాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు మాధవరెడ్డి పొలంలోని బోరుబావి వద్ద మోటారుకు అమర్చిన స్టార్టర్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు బాధిత రైతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ చేసిన వారిని గుర్తించి, తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, జనవరి 29: మండలంలోని నారప్పగారిపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు, వార్డు మాజీ సభ్యుడు గంగిరెడ్డి అకస్మాత్తుగా సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ గ్రామానికెళ్లి అతడి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి తన వంతుగా ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కదిరి అర్బన్, జనవరి 29: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికడదామని కదిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసి డిపోలో ఆయన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ, ప్రమాదరహిత సమాజాన్ని నిర్మిద్దామన్నారు. అనంతరం తమ సర్వీసులో ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనొద్దీన్, డాక్టర్ హుస్సేన్, ఆర్టీసీ అధికారి హరిమోహన్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయండి

ఓబుళదేవరచెరువు, జనవరి 29: ప్రభుత్వ పక్కాగృహాల లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని మండలకేంద్రంలోని ఆర్సీపీ నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మున్నా మాట్లాడుతూ.. గృహనిర్మాణాల ఫైనల్ బిల్లులు ఇంతవరకు అందలేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. నాయకులు శివమ్మ, రాజమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కదిరివాసులు

కదిరిఅర్బన్, జనవరి 29: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కదిరి క్రీడాకారిణులు ఎంపికైనట్లు క్రికెట్ కోచ్ నజీర్ సోమవారం తెలిపారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరుగుతున్న అండర్ 17 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరికి చెందిన వింధ్య, జాగృతి, తేజశ్విని ఎంపికైనట్లు చెప్పారు.

అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

కదిరిఅర్బన్, జనవరి 29: అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి హర్షవర్ధన్‌రాజు ఎంపికైనట్లు పీడీ నసింహాచారి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి 3వ తేదీ వరకు చెన్నయ్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ తరఫున తమ కళాశాల విద్యార్థి పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగరాజు

బత్తలపల్లి, జనవరి 29: బ త్తలపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తాడిమర్రి తహసీల్దార్ నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ యుగేశ్వరిదేవి భూఅక్రమాల ఆరోపణలపై ఇటీవల సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగరాజు ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపటారు. ఎవరైనా భూమి సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. బయట వ్యక్తులు కానీ.. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కానీ.. డబ్బులు అడిగితే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ధర్మవరం, జనవరి 29: పట్టణంలోని గుట్టకిందపల్లి వద్దగల పెట్రోల్ బంక్ ఎదురుగా ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేతిరెడ్డికి కాలనీకి చెందిన రామలింగప్ప బైక్‌లో అనంతపురానికి బయలు దేరాడు. అయితే గుట్టకిందపల్లి పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా జేసీబీ వచ్చి ఢీకొంది. ప్రమాదంలో రామలింగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు

అమడగూరు, జనవరి 29: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, తప్పుడు ప్రచారాలు చేసినా.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బలరామయ్య హెచ్చరించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, ఆరోపణలు, అసభ్యకర పోస్టులు పెడితే.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాపై 130మంది పోలీసులతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.

పశువులకు నీటితొట్టెలు నిర్మించండి

తనకల్లు, జనవరి 29: మండలంలోని గేమేనాయక్ తండా, తులసేనాయక్‌తండా, జామ్లానాయక్‌తండా, బాబేనాయక్‌తండా, అద్దానంపల్లి తదితర గ్రామాల్లో పశువులు, చిన్నజీవాల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెలు నిర్మించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు. నీటి తొట్టెలు లేకపోవడంతో నీటి సౌకర్యం లేక పశువులు, జీవాలు దాహార్తితో విలవిల్లాడుతున్నాయని అంటున్నారు. వేసవి ప్రారంభమైందని, ఇప్పటి నుంచి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. ఉపాధి పథకంలో రోడ్లు,భవనాలు నిర్మిస్తున్నారని, వీటితో పాటు పశువులకు, పక్షులకు, ఇతర మూగజీవాలకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించాలని వారు కోరుతున్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

నల్లమాడ, జనవరి 29: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల కోసమే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాధాన్యత కల్పించినది ఎన్టీఆర్, చంద్రబాబేనని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బీసీల కార్పొరేషన్‌కు ఒక్కరూపాయికూడా ఇవ్వలేదన్నారు. కార్పొరేషన్లను నీరుగార్చింది వైసీపీనేని తెలిపారు. బీసీలందరూ ఒక్కటై రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బుట్టి నాగభూషణం నాయుడు, మణికుమారి, శ్రీనివాసులు, నాగరాజు, రామోహన్, కిరణ్‌కుమార్, వెంకటరాముడు, నాగరాజు, రమణ పాల్గొన్నారు.

వంట మాస్టరు ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు, జనవరి 29: మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన వంట మాస్టరు కె.రామాంజనేయులు(31) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమేదార్ వెంకటరాముడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయులు, అతడి భార్య వరలక్ష్మికి మధ్యన ఇటీవల తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో వరలక్ష్మి నాలుగు రోజుల క్రితం భర్తతో గొడవపడి పుట్టినింటికి వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన రామాంజనేయులు సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషపు ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలోపడి ఉన్న అతడిని బంధువులు గుర్తించి కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారైలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి చిన్నవెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని జమేదార్ పేర్కొన్నారు.

ఎస్ఐగా రమేష్‌బాబు బాధ్యతలు

నల్లమాడ, జనవరి 29: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కియ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తు న్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వరలక్ష్మి వీఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనకు పోలీస్ సి బ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

కొత్తచెరువు, జనవరి 29: కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా రాజారమేశ్ నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలతో సన్మానించారు. సీఐని కలిసిన వారిలో మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, పీవీ శివప్రసాద్,గాజుల చంద్ర, బండ్లపల్లిరాజు,బీడుపల్లి సుబ్బరాయుడు ఉన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి 29: నిబద్ధతతో పనిచేసి ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం ఏర్పడే విధంగా సేవలందించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. కొత్తచెరువు అప్‌గ్రేడ్‌పోలీసుస్టేషన్, దిశా పోలీసుస్టేషన్‌ల సీఐలు రాజారమేష్, విక్రమ్ సోమవారం జిల్లాకేంద్రంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిజాయితీగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

ధర్నాను విజయవంతం చేయండి

కొత్తచెరువు, జనవరి 29: జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఫిబ్రవరి 2వతేదీన ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా చేపట్టనున్నామని, జిల్లాలోని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. దీన్ని నిరసనగా ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు.

మరణించిన ఓటర్లను తొలగించండి

బీఎల్ఓలకు జేసీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం అర్బన్, జనవరి 29: తుది ఓటరు జాబితా వెలువడేటప్పటికి, మరణించిన ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బీఎల్ఓలకు సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... తుది ఓటరు జాబితా వెలువడేటప్పటికి మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీ, తప్పులు ఉంటే సవరించాలన్నారు. ఇందు కోసం బీఎల్ఓలు ఫీల్డు వర్క్ చేయాలని సూచించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'తెలుగులో కన్నడ పేర్లు, తికమక ఓటరు జాబితా' అనే కథనానికి స్పందించారు. ఈ విషయంపై బీఎల్ఓల నుంచి వివరణ తీసుకున్నారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, సైపర్‌వైజర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు తహసీల్దార్‌లు డిప్యూటీ తహసీల్దార్, మునిసిపల్ అధికారులు బీఎల్ఓలు హాజరయ్యారు.

బీజేపీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జిగా పురం నాయకుడు పార్థసారథి



పురందేశ్వరిని సన్మానిస్తున్న పార్థసారథి

హిందూపురం అర్బన్, జనవరి 29: భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్‌గా తనను నియమించినట్లు హిందూపురానికి చెందిన జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి నియమించారన్నారు. తాను 25 సంవత్సరాలుగా పార్టీకి అందించిన సేవలు గుర్తించి ఈ బాధ్యతాయు తమైన పదవి ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించడంతో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాన న్నారు. తనకు ఈ పదవి ఇచ్చేందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ శివనారాయణ, జిల్లా అధ్యక్షుడు శేఖర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పురందేశ్వరిని సన్మానించినట్లు తెలిపారు.

'సభను విజయవంతం చేయండి'

పెనుకొండ, జనవరి 29 : బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్న సామాజిక ఐక్యత సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అనుభవజ్ఞులైన మేధావులతో అవగాహన కల్పిస్తామన్నారు. సామాజిక ఐక్యత సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు యంగ్ ఇండియా వెంకటేశులు, రవికుమార్, మునిమడుగు నరసింహులు, రామక్రిష్ణ, హరిలాల్‌నాయక్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



గుమ్మయ్యగారిపల్లిలో విద్యార్థుల మానవహారం

గోరంట్ల, జనవరి 29: స్థానిక ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాల, గోరంట్ల రాజీవ్‌కాలనీలోని ఎస్వీపీ ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం హెచ్ఐవీ నివారణపై మండలంలోని గుమ్మయ్యగారిపల్లిలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఐదోరోజు విద్యార్థులు ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఎయిడ్స్‌వ్యాధికి మందులేదని, నివారణే ఏకైక మార్గమని ఎన్ఎస్ఎస్ పీఓలు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. అలాగే ఎస్ఏపీఎస్ ఎయిడెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు జీనవాండ్లపల్లిలో ప్రత్యేక కాంప్ నిర్వహించారు. పీఓ కళావతి ఆధ్వర్యంలో పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తూ, ప్రదర్శన జరిపారు.

యువతతోనే నవసమాజ నిర్మాణం

పెనుకొండ, జనవరి 29: నవసమాజ నిర్మాణం యువతతోనే సాధ్యపడుతుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ వశీతతేజ పేర్కొన్నారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదర్శ సమాజ నిర్మాణం జరగాలంటే విద్యార్థి, యువత అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి గగన్మహల్‌లో, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు రంగనాయకులు, స్థానిక వైద్యశాల రక్తదాన సిబ్బంది నంకుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బీసీలను అన్నివిధాలా ఆదుకున్నది టీడీపీనే

గుండుమల తిప్పేస్వామి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న గుండుమల తిప్పేస్వామి తదితరులు

రొళ్ల, జనవరి 29: బీసీలను అన్ని విధాలుగా ఆదుకున్నది తెలుగుదేశం పార్టీనే అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. రొళ్ల మండల కేంద్రంలో సోమవారం లక్ష్మీనరసింహస్వామికి పూజలు నిర్వహించి మూడువేల బైకులతోర్యాలీగా లక్ష్మీపాలెస్ చేరుకున్నారు. అక్కడ జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ... వైసీపీ పాలనలో బలహీన వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని విమర్శించారు. పలువురు బీసీలపై చాలా తప్పుడు కేసులు పెట్టారని, సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించలేక పోయారని అన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు ఆదరణ పథకం కింద స్వయం ఉపాధి రుణాలు, 90 శాతం రాయితీ రుణాలు అందించారని తెలిపారు. వైసీపీ పాలనలో బీసీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.34వేల కోట్లు మళ్లించారని ఆరోపించారు. బీసీలకు ఇచ్చిన నామినేటెడ్ పదవులు అలంకార ప్రాయంగానే ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీలకు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ఒక్క ఇల్లు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, జిల్లా నాయకులు పోతులయ్య, ఎస్సీ సెల్ జిల్లాఅధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి సురేష్, ప్రధాన కార్యదర్శి ఈరన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు భరత్, మాజీ జడ్పీటీసీ సన్నతిమ్మప్ప, వక్కలిగ రాష్ట్ర డైరెక్టర్ ముదుపేగౌడ్, మాజీ ఎంపీపీ సిద్దగంగప్ప, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన మొదలైంది వినాశనంతోనే..!

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, జనవరి 29 : రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల కిందట జగన్ పాలన వినాశనంతో మొదలైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి సవిత విమర్శించారు. ఆమె సోమవారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో టీడీపీ శ్రేణులతో సవిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... నాలుగున్నరేళ్లకు పైగా విధ్వంశాలు, అరాచకాలతో పాలన సాగించిన సీఎం జగన్ మళ్లీ తన భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టడానికి సిద్ధం కావచ్చు కానీ, అందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. గత ఎన్నికల మునుపు తాను ప్రజలకు ఇచ్చిన హామీలను జగన్ ఓ సారి నెమరవేసు కోవాలన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రజలు కౌరవులుగా చూస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ప్రజల జీవితాల్లో ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. ఈ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలంద రూ ఆయన బాధితులేనని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాలతో మళ్లీ అధికారంలోకి రావాలని జగన్ చూస్తున్నారని సవిత పేర్కొన్నారు. తన పాలనలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఏం చేశారని ప్రశ్నించారు. అన్ని కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన నేత ఈ సీఎం అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.3లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ ఏమైందని నిలదీశారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు హామీలు మూలానపడ్డాయా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో జగన్ తన ఓటమిని అంగీకరిం చేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, సోము, గుట్టూరు సూరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు

ఇబ్బందులు పడిన ప్రయాణికులు



రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న విద్యుత్ తీగలు

మడకశిరటౌన్, జనవరి 29: బైపాస్ రోడ్డు మీదుగా మారుతీనగర్ నుంచి మడకశిర పట్టణానికి వెళ్లే రహదారిపై సోమవారం ఉదయం విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించిన జనం చాలా ఇబ్బందులు ప డ్డారు. నిత్యం కొంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి అది. మారుతీనగర్ నుంచి స్కూల్ బస్సులు, కాలినడకన ప్రజలు పట్టణానికి ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తారు. పైగా పాఠశాలలకు, కార్యాలయాలకు వేళ్లే సమయం కావడంతో మారుతీనగర్ వాసులు, రహదారిపై ప్రయాణించే పలువురు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో విద్యుత్ స్తంభం నుంచి జారిపడి న విద్యుత్ వైర్లలో విద్యుత్ సరఫరా అవుతుండేదని కాలనీ వాసులు తెలిపారు. అధికారులు ఎంతసేపటికీ స్పందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు గంటల తరువాత విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయడంతో ఊపిరి పీల్చుకొన్నారు. విద్యుత్ తీగలు జారిపడడానికి కారణాలు తెలియరాలేదు.

ఆదర్శ పాఠశాల ఆవరణలో గడ్డి పొద

భయాందోళనలో విద్యార్థులు సిబ్బంది



పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన గడ్డి

అగళి, జనవరి 29 : స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో గడ్డి, కంపచెట్లు విపరీతంగా పెరిగి, విషపురుగులకు ఆవాసంగా తయారైందని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణంలోని బాలికల వసతిగృహం కూడా ఉందని దీంతో విషపురుగు బెడద ఎక్కువై వారానికి రెండు మూడు పాములు చంపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పాఠశాల ఆవరణం చుట్టూ కంపచెట్లు అధికంగా పెరిగాయని దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. అగళి చెరువు నిండిన నేపథ్యంలో ఈ పాఠశాల ఆవరణం కూడా జలమయమై గడ్డి, కంప చెట్లు పెరగడానికి కారణమని వారు తెలుపుతున్నారు. ఏది ఏమైనా పంచాయతీ అధికారులు స్పందించి పాఠశాల ఆవరణంలో ఉన్న కంప చెట్లు, ఏపుగా పెరిగిన గడ్డిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రిన్సిపాల్ జాఫర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

వైసీపీ దౌర్జన్యాలను అరికట్టండి

తహసీల్దార్‌కు కారుడపల్లి వాసుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

హిందూపురం అర్బన్, జనవరి 29: వైసీపీ నాయకులుగా చెప్పుకొంటూ పలువురు దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవా లని కారుడిపల్లి గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కారుడిపల్లి వాసులు మాట్లాడుతూ... మండలంలోని రామచంద్రాపురానికి చెందిన వైసీపీ నాయకుడు రామకృష్ణ ఆదివారం కారుడిపల్లి చెరువులో ఉదయం 6 గంటల నుంచి ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్‌లలో మట్టి తరలిస్తున్నాడన్నారు. ఇది గమనించి రైతులు అక్కడికి వెళ్లి చెరువులో మట్టి తరలించరాదని, మీరు మట్టి తరలించడానికి ఎవరు అనుమతులు ఇచ్చారని నిలదీశారు. దీంతో అతడు నన్ను అడగడానికి మీరెవరు... అనుమతులు మీకెందుకు చూపించాలని దురుసుగా ప్రవర్తించాడని, దౌర్జన్యా నికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను విచారించి అనుమతులు ఇచ్చారా లేదా తెలుసుకొని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు పంట పొలాలకు మట్టి తోలుకోవాలని అడిగితె మాత్రం అనుమతులు ఇవ్వరని, ఇలా ఎక్స్‌కవేటర్‌లు పెట్టి మట్టిని తోలుకునేందుకు అనుమ తులు ఎలా ఇస్తారని రైతులు ప్రశ్నించారు. ఈ విషయాన్ని సంబంధిత వీఆర్ఓ, వీఆర్ఏలకు తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన చెందారు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కూడా సీఐకి తెలిపామన్నారు.

మారని మనుషులు.. తగ్గని ప్రమాదాలు


- ◆ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నా యథాస్థితి
- ◆ మితిమీరిన వేగం... పరిమితికి మించి ప్రయాణం
- ◆ శ్రుతి మించిన యువత తీరు
- ◆ తల్లిదండ్రులు, పోలీసుల ప్రేక్షకపాత్ర



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

హిందూపురం అర్బన్, జనవరి 29: ప్రభుత్వం ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు ప్రమా దాలపై అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది ఇంకో అడుగు ముందుకేసి కేంద్ర ప్రభుత్వం మాసోత్సవాలు నిర్వహిస్తోంది. పట్టణంలో ఈ నెల 27న రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మాధవరెడ్డి హాజరై వాహనాదారులకు అవగాహన కల్పించారు. రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు ఎలా వ్యవహరించాలి? తదితర వాటిపై మాట్లాడారు. కానీ పట్టణంలో, మండలంలో ఆ మార్పు కనిపించడంలేదు. ఆ మరుసటి రోజే అతిగా మద్యం తాగిన మత్తులో అతి వేగంగా కారు నడిపి ఒకే కుటుంబంలోని తండ్రీ కొడుకుల ప్రాణాలు పోవడానికి ముగ్గురు కారకుల య్యారు. అదే విధంగా మూడు రోజుల క్రితం ముగ్గురు యువతులు ద్విచక్ర వాహనం నడుపుతూ కారును ఢీ కొట్టి గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఇక ఆటోల్లో అయితే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి తరలిస్తుంటారు. డ్రైవర్ సీటు పక్కన ఒక్క వ్యక్తి కూడా అదనంగా ఉండకూడదనే నిబంధన ఉన్నా పట్టించుకోరు. డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను ఎక్కించుకొని ఆటోలు నడుపుతున్నారు. అదుపు తప్పితే ప్రయాణికుల ప్రాణాలు గాలిలోకి కలిసిపోవాల్సిందే. ఇవిఇలా ఉంటే... ముఖ్యంగా యువత కొత్త, కొత్త మోడళ్ల ద్విచక్ర వాహనాలను జనం మధ్యనే రయ్... రయ్ మనిపిస్తున్నారు. వారు వచ్చే వేగానికి జనం భయపడి పక్కకు పరుగెత్తాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాల సైలెన్సర్ల తొలగించి వాహనాలు నడుపడంతో శబ్ద కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు తల్లిదండ్రులు గానీ, ఇటు పోలీసులుగానీ యువతను అదుపు చేయలేకపోతున్నారు. కఠినంగా వ్యవహరిస్తే తప్పా యువత దారికి వచ్చేలా కనబడలేదని ప్రజలు అంటున్నారు. యువత వయస్సుకు మించిన వాహనాలు కొని ఇవ్వడమే కాకుండా వారిపైన దృష్టి పెట్టక పోవడంతోనే విచ్చల విడిగా చెలరేగి పోతున్నారని కొంత మంది చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా యువత అతి వేగంగా వాహనాలను నడపడడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు. పోలీసులు, రవాణా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు మరింత చేపట్టాలని కోరుతున్నారు. అలాగే కఠిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని విన్నవిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రమాదాలు జరుగకుండా కఠినంగా చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై కాపు కాసి అతి వేగంగా వాహనాలు నడిపే వారు, మైనర్లు, వాహన డ్రైవింగ్ లైసెన్సు లేనివారు తదితరులను అదుపులోకి తీసుకుంటాం. జరిమానాలు విధిస్తాం. పోలీసులతో కలిసి వాహన తనికీలు చేపట్టి కౌన్సిలింగ్ ఇస్తాం. వాహనాలను సీజ్ చేసి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తాం.

- కరుణాసాగర్‌రెడ్డి, ఆర్టీఓ, హిందూపురం

పవర్‌లూమ్స్ కార్మికులను ఆదుకోండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

గోరంట్ల, జనవరి 29: పవర్‌లూమ్స్ కార్మికులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు పవర్‌లూమ్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పలువురు కార్మికులు గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేత వస్త్రాల ఎగుమతులు నిలిచిపోవడంతో కూలీలుగా పనిచేస్తు న్న కార్మికులకు ఉపాధి లభించక నరకయాతన పడుతున్నామన్నారు. నివాస గృహాలకు అద్దెలు చెల్లించలేని స్థితిలో ఉన్నామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌ను స్పందనలో కలిసి తమ గోడు వినిపించా మని తెలిపారు. ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని అభ్యర్థించామన్నారు. కలెక్టర్ సూచన మేరకు 90మంది నేత కార్మికులు దరఖాస్తులతోపాటు వినతిపత్రాన్ని తహసీల్దార్ రంగనాయకులుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూమ్స్ కార్మిక సంఘం నాయకులు సుధాకర్, రామక్రిష్ణ, శంకర్‌బాబు, మహేష్, వెంకటేశ్, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీ

టీడీపీ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న పాండురంగప్ప

రొళ్ల, జనవరి 29: ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారని, ఇక ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప పేర్కొన్నారు. ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. వైసీపీ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ఐదేళ్ల పాలనలో ఎస్సీ, బీసీ అని చెప్పి కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని అన్నారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ ప్రకటి స్తామని చెప్పి, జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చారని, రాష్ట్రం మొత్తాన్ని కల్తీ మందుకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. ఈసందర్భంగా మాజీ సర్పంచి సన్నమారేగౌడ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఆ కమిటీ ఎన్నిక చెల్లదు

సాధుచెట్టి సంఘం నాయకులు

హిందూపురం, జనవరి 29 : సాధుచెట్టి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు జేఈ వెంకటస్వామి ప్రకటించుకున్నా... అది ఏమాత్రం చెల్లదని సాధుచెట్టి సంఘం కులపెద్దలు పేర్కొన్నారు. వారు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం కంచికామాక్షి కళ్యాణమండపంలో సాధుచెట్టి సంఘం కమిటీ ఎన్నుకునేందుకు సాధుచెట్టి కులస్థులు సమావేశమయ్యారు. కానీ జేఈ వెంకటస్వామి, ఆయన వర్గీయులు దౌర్జన్యంగా, అధికశాతం కులస్థుల ఆమోదం లేకుండా తమకు అధ్యక్షుడిని ప్రకటించి పూల దండలు వేసుకోవడం సరికాదన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరగాలన్నారు. విలేకరుల సమావేశంలో సాధుచెట్టి సంఘం నాయకులు మంగేష్, నాగరాజు, రామయ్య, గోపాల్, వెంకటేశు తదితరులు పాల్గొనాలన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక



ఎంపికైన మండల కమిటీ సభ్యులు

మడకశిరటౌన్, జనవరి 29: ఎస్టీయూ మడకశిర మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. పట్టణంలో సోమవారం ఎస్టీయూ మండల సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీని ఎన్నుకున్న ట్లు తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా దొరబాబు, ఆర్థిక కార్యదర్శిగా శ్యామిల్, జిల్లా కౌన్సిలర్లుగా మారుతి, నారాయణప్ప తదితరులను ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తాము పోరాడుతూనే ఉంటామని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 30 శాతం ఐఆర్‌ను ఇవ్వాలని, కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లుల చెల్లింపు కేంద్రం ఏర్పాటు

హిందూపురం అర్బన్, జనవరి 29: వినియోగదారుల సౌఖర్యార్థం పట్టణ పరిధిలోని మేళాపురం ఆటో స్టాండ్ వద్ద కరెంటు బిల్లుల చెల్లింపు కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏఈఈ లక్ష్మీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. వేళాపురం, చౌడేశ్వరీకాలనీ, సదాశివనగర్, మారుతినగర్, హనుమాన్‌నగర్, మార్కండేయనగర్, విజయ్‌నగర్‌కాలనీ, డ్వాక్రా కాలనీ, అహ్మద్‌నగర్, సత్యసాయినగర్ ప్రాంతంలో ఉన్న వినయోగదారులకు అనుకూలంగా ఉంటుందన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు

హిందూపురం డి-2లో ఎస్ఎల్‌గా పని చేస్తున్న ప్రభాకర్ బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచినందుకు, సోమవారం హిందూపురం డివిజన్ కార్యాలయంలో ఆయనను అభినందించారు. ఇటీవల జరిగిన డిపార్టుమెంట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి విజవాడలో సీఎండీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి సిబ్బంది, అధికారులు అభినందించారు.

మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి



తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పావగడ, జనవరి 29: తాలూకాలోని కడపలకెరె గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవిపై దాడిచేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు పూజారప్ప ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ వరదరాజులకు వినతిపత్రం అందజేశారు. బాధిత మహిళకు న్యాయం చేయా లని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రం ద్వారా ముఖ్యమంత్రి, హోం మంత్రికి విన్నవించారు. మధుగిరి డీవైఎస్పీ రామచంద్రప్ప ఒక ఉన్నతాధికారి అయి ఉండి మహిళ అనే కనికరం లేకుండా ఆమెపై సిబ్బందితో కలిసి దాడి చేయడం అమానుషం అన్నారు. దాడి చేసిన వారిని సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వందలాది మంది రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.